క్లుప్తంగా

రౌడీషీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



కాకుమాను: మండలంలో రౌడీషీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుడా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో రాత్రి సమయాల్లో ప్రతి రోజూ గస్తీ నిర్వహించి, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెడింగ్ కేసుల వివరాలను పరిశీలించి, ఎస్ఐ రవీంద్రను అభినందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చానల్‌లో దూకి వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం




చేబ్రోలు: అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురైన వృద్ధురాలు సోమవారం చేబ్రోలులోని కొమ్మమూరు చానల్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆమెను స్థానికులు, 108 సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. చుండూరు మండలం మున్నంగివారి పాలెం గ్రామానికి చెందిన గుత్తా జయలక్ష్మి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం చుండూరు నుంచి వచ్చిన ఆమె కొమ్మమూరు చానల్ బ్రిడ్జి నుంచి కొంత దూరం వెళ్లి అక్కడ నీటిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రవాహానికి కొట్టుకుపోతున్న ఆమెను బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన కూలీలు గమనించి, చానల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనాలు చేసే మట్టి దిబ్బ వద్దకు చేర్చారు. హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్న 108 సిబ్బంది చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. చానల్‌లో దూకడంతో జయలక్ష్మి కాలు విరిగిపోయింది. సుమారు పది అడుగుల ఎత్తులో ఉన్న కట్టమీదకు చేర్చటానికి సమస్యగా మారింది. పెద్ద సంచిలో వృద్ధురాలిని కూర్చోబెట్టి ఇనుప నిచ్చెన ద్వారా స్థానికుల సహాయంతో 108 సిబ్బంది పైకి తీసుకువచ్చారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



గుంటూరు ఈస్ట్: మాస శివరాత్రి, కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని తురకపాలెం గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. స్వామికి విశేష ద్రవ్యాలతో కన్నుల పండువగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్రనామార్చనలు జరిపారు. సాయంత్రం శివలింగాకారంలో దీపోత్సవం వైభవంగా చేశారు. దీపాకాంతుల నడుమ ఆలయం బంగారుకాంతులీనింది. ఆలయ ప్రధాన అర్చకులు నాగఫణీంద్రకుమార్‌శర్మ పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

ఓటు వేయడం యువత బాధ్యత



పొన్నూరు: ఓటు వేయడం యువత బాధ్యతని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ కె. శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చింతలపూడిలో గల వీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన (స్వీప్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం వల్ల సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవచ్చని తెలిపారు. ఎన్‌వీఎస్‌పీ ఆల్‌లైన్ యాప్ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు డెప్యూటీ తహసీల్దార్ ఫణి కుమార్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులతో ఓటు నమోదు చేయించే కార్యక్రమాన్ని సెక్షన్ లీడర్లు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రతి కుటుంబం అభివృద్ధి

- 'జగనే ఎందుకు ఏపీకి ముఖ్యమంత్రిగా కావాలి ?' కార్యక్రమానికి స్పందన
- ఇంటింటికీ వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



నగరాలులో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



గొడవర్రు సచివాలయంలో...



నందూరు గ్రామ సచివాలయంలో..



పొన్నూరు పట్టణంలోని సచివాలయంలో ...

గుంటూరు రూరల్: జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో అభివృద్ధి చెందుతుందని అర్బన్ క్లస్టర్– 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు.46వ డివిజన్ నగరాలులోని 181 సచివాలయం పరిధిలో సోమవారం డివిజన్ కన్వీనర్ ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జగనే ఎందుకు ఏపీకి ముఖ్యమంత్రిగా కావాలి ? కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ నేతలు వెళ్లి, ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరలా జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబు, రాచకొండ ముత్యాల నాగరాజు, దుంపాల రాధ, కొండా అజయ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, చంటి, మన్నెం లక్ష్మి, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చేబ్రోలు: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. గొడవర్రు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే ? కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. గ్రామంలోని సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. జేడీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ పెద మస్తాన్, గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవి, చుక్కా నాగబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పరిపాలనలో పెనుమార్పులు తీసుకువచ్చారని తెలిపారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి. బాబూరావు, పార్టీ నాయకులు శివయ్య, చంద్రశేఖరరెడ్డి, వీరభద్రయ్య, బొమ్మా రాము, మార్క్ గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పొన్నూరు: గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయల వ్యయంతో గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాల్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ భవనం పద్మలీల తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నండూరులో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో గత నాలుగున్నర ఏళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో ఎంపీపీ పద్మలీల మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకునే విధంగా సీఎం జగనన్న పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, సర్పంచ్ అక్కి నాగరాజు, నాయకులు సర్దార్, మనోహర్, దాసరి శివరామకృష్ణ, నాగప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు .

■ పొన్నూరు పట్టణంలోని14, 15 వార్డుల పరిధిలోని సచివాలయంలో వార్డులో జరిగిన అభివృద్ధి, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల వివరాలతో ప్రదర్శించిన బోర్డుల్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా వార్డులలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. మహమ్మద్, నాయకులు కె. శ్రీనివాసరావు, మల్లెల రాజు పాల్గొన్నారు.

శివాలయంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



ఈవో శ్రీనివాసరెడ్డి, చైర్మన్ శివశంకరరావుకు సూచనలిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఆలయాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సూచించారు. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని పెదకాకాని శివాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి భక్తులు దీపాలు వెలిగించుకుంటున్న ప్రాకార మండపం, కల్యాణ కట్ట, పొంగలి షెడ్డు, గాలి గోపురం ప్రాంతాల్ని పరిశీలించారు. ఆలయ సిబ్బంది, బందోబస్తుకు వచ్చిన వారి వాహనాలు సైతం ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి అందులో పెట్టుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో వాహనం కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్య విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావుకు సూచించారు.

రేపు పెదపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్రజ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలంలోని పెదపాలెంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు 14,024 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 12,005 మందికి కళ్లజోళ్లు అందించినట్లు అంబటి మురళీకృష్ణ వివరించారు.

శలపాడులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చేబ్రోలు: మండలంలోని శలపాడులో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ద్రాక్షావల్లి ప్రార్థన మందిరంలో పాస్టర్ వీసం ఏసుబాబు దైవ సందేశాన్ని అందించారు. బాలఏసు జననం లోకానికే వెలుగుల్ని నింపిందని తెలిపారు. ఏసు క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకాలని సూచించారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యుడు ఉయ్యూరు వెంకటేశ్వరరావు, అద్దంకి సాంబశివరావు, పరిశా పూర్ణయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

సందడిగా వీవీఐటీ బాలోత్సవ్- 2023



బాలోత్సవ్ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



బాలోత్సవ్ కారులో షికారు



వేడుకల్లో చిన్నారి నృత్యం



అమ్మా...ఒక సెల్ఫీ



సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారి



విద్యార్థులతో కలసి స్టెప్పులేస్తున్న విక్టరీ వెంకటేష్



నాన్నా... మేకప్ జాగ్రత్త



చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు



వేడుకల్లో చిన్నారుల సందడి

నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో సోమవారం బాలోత్సవ్ వేడుకలు కోలాహలంగా సాగాయి. చిన్నారులు, తల్లిదండ్రులు, చిత్ర బృందంతో వీవీఐటీ ప్రాంగణం సందడిగా మారింది. ఏకపాత్రాభినయం, సంప్రదాయ నృత్యం, సంప్రదాయ వస్త్రధారణ వంటి విభాగాల్లో తొలిరోజు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యధికంగా చిత్రలేఖనం పోటీల్లో 1600 మంది చిన్నారులు పాల్గొన్నారు. తెలుగు వక్తృత్వం, తెలుగులోనే మాట్లాడటం, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం వంటి విభాగాలు చిన్నారుల్లో తెలుగుపై ఉన్న మక్కువను తెలియజేశాయి. హీరో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ చిత్ర యూనిట్ చిన్నారులతో ఆడి, పాడి అలరించింది. చిత్ర హీరో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ చిన్నారులు ఎల్లప్పుడూ మంచిగా ఆలోచించాలని, తద్వారా ఆనందంగా ఉంటారని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. అనంతరం సైంధవ్ చిత్రంలోని పాటను చిన్నారుల మధ్య విడుదల చేశారు.

– పెదకాకాని

చదువే ధైర్యం.. గమ్యం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు చదువే ధైర్యం.. గమ్యమని పాశం సొసైటీ అధ్యక్షుడు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పాశం రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ ప్రసంగం (మోటివేషనల్ స్పీచ్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అభినంద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే నాటి నుంచే భవిష్యత్తుకు మార్గం వేసుకునే దిశగా కృషిచేయాలని సూచించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందించడమే తమ సొసైటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. టైం మేనేజ్‌మెంటు, గోల్ సెట్టింగ్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ యద్దనపూడి ఆరుద్ర అవగాహన కల్పించారు. నేటి యువత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించే విధంగా తగిన ప్రణాళికలతో సాగాలని సూచించారు. సమయ స్ఫూర్తితో విద్యలో రాణించాలని తెలిపారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే దానికి తొలిమెట్టు చదివేనని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం . చంద్రశేఖర్ అతిథుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీ బాలాజీ, సొసైటీ కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, సొసైటీ సభ్యులు ఉమేష్ చంద్ర, నిహంత్, కిశోర్ పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చేబ్రోలు: స్థానిక నాగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్దసంఖ్యలో భక్తులు కార్తిక దీపాల్ని వెలగించారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో చివరి కార్తిక సోమవారం సందర్భంగా విశేష పూజల్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఒకటి, రెండు రోజుల్లో పంట నష్టం నమోదు



కొండపాటూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో కిరణ్మయి



మిర్చి రైతులకు సూచనలు చేస్తున్న హార్టీకల్చర్ ఆఫీసర్ బేబి

కాకుమాను: ఒకటి, రెండు రోజుల్లో వ్యవసాయ సిబ్బంది మండల వ్యాప్తంగా గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాల్ని నమోదు చేయనున్నట్లు ఏవో కె.కిరణ్మయి సూచించారు.మండలంలోని కొండపాటూరులో తుఫాన్ కారణంగా నీట మునిగిన పంట పొలాల్ని సోమవారం ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట పొలాల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలని తెలిపారు. నీట మునిగిన వరి పైర్లను పైకి లేపి కట్టలుగా కట్టాలని, దుబ్బులు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేయాలని ఆమె తెలిపారు.

మిర్చి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెదనందిపాడు: అకాల వర్షాలకు దెబ్బతిన్న మిర్చి పంటను కాపాడుకోవటానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హార్టీకల్చర్ ఆఫీసర్ ఎం. బేబి సూచించారు. మండల పరిధిలోని నాగులపాడు, పాలపర్రు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న మిర్చి పొలాల్ని సోమవారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించాలని, వాలిపోయిన మొక్కల్ని జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలని తెలిపారు. ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాములు యూరియా కలిపి ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. వడలిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు.

ఆత్మస్థైర్యం, పట్టుదల ఉంటే అంగవైకల్యం అడ్డుకాదు



బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు కెనడీ, విజయభాస్కర్

కాకుమాను:ఆత్మస్థైర్యం, పట్టుదల ఉంటే అంగవైకల్యం అభివృద్ధికి అడ్డుకాదని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 3న నిర్వహించాల్సిన వేడుకలు తుఫాన్ కారణంగా సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దివ్యాంగులపై సానుభూతి కాకుండా వారిలో మనోధైర్యం నింపాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 విజయ్ భాస్కర్, ఐఈఆర్టీ టీచర్ దయమ్మ, దివ్యాగులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివాలయంలో వైభవంగా కర్పూర జ్యోతి



ప్రత్తిపాడు: స్థానిక శ్రీ గంగాపార్వతీ సమేత దండేశ్వరాయలంలో సోమవారం కర్పూర జ్యోతి శోభిల్లింది. కార్తిక మాసం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ చైర్మన్ బాపతు నాగమోహన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో కర్పూర జ్యోతిని వెలిగించారు. సుమారు క్వింటాకు పైగా కర్పూరాన్ని వెలిగించి అయ్యప్ప భజనలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్తిపాటి పరమేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.